4 పేజీలు అణా: ప్రారంభం 1930 R. No. M. 3152.

# జమీన్‌రైతు

"Zamin Ryot" Nellore.
(A National Kisan Weekly)

సంపాదకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు.

| సంపుటం 12 | శుక్రవారము : నెల్లూరు : 31—10—41 | సంచిక 44 |
|---|---|---|

## హిందూ, మహమ్మదీయ గలాటా

### ఇండ్ల దహనం, బాకుపోట్లు, చావులు,

### అధికార్ల పక్షపాతం, ఇంకా - ఇంకా -

[మా ప్రత్యేక విలేకరి]

### దెబ్బలు - బాకుపోట్లు

కలువాయి వాస్తవ్యుడు కొర్రపాటి గోవిందు అనే విశ్వబ్రాహ్మణ్ణి బారకాసులో 25 తేది మధ్యాహ్నం మహమ్మదీయులు కొట్టి పారిపోయినారు. ఇది కలువాయి పార్టీలకు సంబంధించినదిగా చెప్తారు. జవ్హారిలాల్ రోడ్డులో జట్కాతోలే మహమ్మదీయుడిని హిందువులుకొట్టారట.

25 తేది సా॥ యడవల్లి సీతారామయ్యగారిని (పెన్షనర్) పవర్ హవుస్ రోడ్డువద్ద మహమ్మదీయులు కత్తితో చెవ్వుదగ్గర పొడిచారు.

25 తేది సా॥ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఒకమహమ్మదీయుని హిందువులు కొట్టినారట

26 తేది రంగనాయకుల పేటలో ఒకవర్తకుడు బజారును వెతుకుంటూపోగా తమఇంటివద్దవున్నది రమ్మనిచెప్పి మహమ్మదీయుల తమలోపలికి లాగి కొట్టారట.

26 తేది కోర్టు అమీనా సత్యనారాయణను కూరగాయలు తెస్తుంటే హైలువద్ద మహమ్మదీయులు పొడిచారు. ప్రాసస్ సర్వర్ అప్పయ్యను రాళ్లతో కొట్టారు.

26 తేది యిద్దరు కలెక్టరుఆఫీసు గుమాస్తాలను కొట్టినారు.

ఈతేదిన్నే మ్యాల్ల డి. యిన్స్పెక్టరు కాలిదాసు వెంకటప్పయ్యగారు కూరగాయల మార్కెట్టుకు పోగా ఒకమహమ్మదీయుడు వీరిని కత్తితో పొడిచాడు.

26 తేది మధ్యాహ్నం ట్రంకురోడ్డు నుంచి దండువారివీధికి పొయ్యేచోట ఒక మహమ్మదీయుణ్ణి కొట్టారు.

27 తేది ఉదయం కుమ్మరవీధిలో పెళ్లూరు వీరయ్యను మహమ్మదీయులు పొడిచారు అతను చనిపోయినాడు. వీరయ్య అన్ననుకూడా కొట్టినారు. పులికంటి శేషయ్య మామనుకూడా పొడిచారట.

### వకీళ్లకు దెబ్బలు

సంగోలు వెంకటరంగయ్య పంతులు, వెల్లంకొండ వరదాచార్యులవారు కోర్టునుండివస్తుంటే మహమ్మదీయులు రాళ్లతో కొట్టారు.

### కారు ముట్టడి

26 తేది ప్రిన్సిపల్‌విచారణకు పోయి వస్తుంటే హిందూసభా ప్రెసిడెంటు పైడా సుబ్బరామయ్య కారును బారెక్సులో మహమ్మదీయులు ముట్టడించారు. స్పీడ్ గా వెళ్ళినందున తప్పించుకొన్నారు.

28 తేది మొత్తం 24 మందికి దెబ్బలని తెలుస్తున్నది.

### పోస్టాఫీసు మీద రాళ్ళు

పెద్ద పోస్టాఫీసు మీద 26 తేది రాళ్ళు పడినవట.

### చాకలవీధి గలాటా

26 తేది పగలు 3 మార్లు మహమ్మదీయులు ఈ వీధిమీదకు పోట్లాటకు వచ్చారు. రాళ్లవర్షం పూర్తిగా కురిసింది. ఒకటి రెండు హిందువుల ఇండ్లు దోపిడీకూడా జరిగింది. 3-వ దఫా డిప్టీ కలెక్టరు డిప్టిసూపరింటు వచ్చి రిజర్వుపార్టీని అక్కడ కావలావుంచిన తర్వాత అల్లరిలేదు. మొదటనే ఈ మాట అధికార్లకు చెప్పితే చెవికెక్కలేదు. ఈ గలాటాలో మంగమ్మ అనే ఆమెకు కాలిమీద మంచిరాళ్ళదెబ్బలు తగిలినవి. వందలకొలది వచ్చిన మహమ్మదీయులు తప్పించుకొన్నారు. హిందువులపక్క 4 గురిని అరెస్టుచేశారు. మహాలక్ష్మమ్మ దేవాలయాన్ని కొట్టారు.

*

27 తేది నెల్లూరు పెద్దస్టేషనుకు ఉత్తరప్రక్క రైల్వే పట్టాపాపు తూర్పు ప్రక్కన ఒక హిందూ బిక్షగాడిని (యితని పేరు తెలియదు. గూడూరువాస్తవ్యుడని అంటున్నారు) రైల్వే నౌకరి అయిన అబ్దుల్ రహిమాన్ అనే మహమ్మదీయుడు పొడిచాడని అతన్ని అరెస్టుచేశారు. ఆ బిక్షగాడు చచ్చాడు.

### సారాయి అంగడి లూటీ

28 తేది రాత్రి డైకస్ రోడ్డులో వుండే నెం 3 వ సారాయి అంగడిని మహమ్మదీయులు దోపిడిచేసి 3 గాలాల సారాయి తాకేసినారు.

29 తేది సాయంత్రం ఆంజనేయస్వామి దేవాలయము ప్రక్కన ఒక మహమ్మదీయుడిని కొట్టినారట.

అద్యతుంవారివీధివాస్తవ్యుడు మున్సిపుగానుగ యల్లమందారెడ్డి బండిమనిషి, గడియా కొండయ్య 29 తేది ఉదయం బజారునపోతుండగా టవున్ పోలీసుస్టేషనుకుఉత్తరంగా 20 గజాలలో మహమ్మదీయులు అతనిని విపరీతంగా మర్దించి పంపినారు. పోలీసుస్టేషన్ ప్రక్కనే యిలా జరుగుతుండడం చిత్రంగాయుంది. 10 మందికి పైగా ఒకచోట చేరకూడదనే 144 సె॥ మహమ్మదీయులకు వర్తించదేమో? టవున్ స్టేషన్ చుట్టుప్రక్కల వందలకొలది మహమ్మదీయులు మూగియుంటుంటే యీ 144 సె॥ వారినేమి అనడం లేదు.

29 తేది ఉదయం శిఖరంవారివీధి వాస్తవ్యుడు భండారం సుబ్బయ్యశెట్టి బారకాసు మీదుగా చాకలివీధికి పోతుండగా మహమ్మదీయులు కొట్టినారు.

29 తేది రాత్రి స్టవునసుపేటలో ఒక మహమ్మదీయుణ్ణి బరిశతో పొడిచారట.

### దోపిడి

26 తేది రాత్రి కామాటివీధి లోపలవుండే గునుపాటివారి సందులో 3 యిండ్లు వైశ్యులవి దోపిడి జరిగింది. మరొక ఆచార్యులగారి యింట్లో కూడా ధాన్యం దోపిడి జరిగిందట.

దాడివారివీధిలో చాలాఇండ్లు దోపిడిపోయినవి. ఆ వీధిలో చాలామంది కాపురాలు లేచిపోయినారు. యీవీధి కాపురస్తుడు పోస్టుజవాన్ బి ఆనంతరామసింగు ఇల్లుకూడా లూటీచేయబడ్డదట.

25 తేది స్టోర్‌హవుసు పేటలో మహమ్మదీయ బంకులు రెండు పడగొట్టబడినవట.

### ఇండ్ల దహనం

| | ఇండ్లు |
|---|---|
| నవాబ్ పేట పోలీసు స్టేషన్ యిలాకా స్టోర్‌హవుసు పేట పోస్టాఫీసువద్ద 26 తేది— | 13 |
| చెట్టిగుంట రోడ్డులో 28 తేది— | 8 |
| 30 తేది— | 20 |
| ఉదయగిరివారితోటలో 27 తేది— | 16 |
| పప్పులవీధిప్రక్క గులామ్‌లీఖాన్ తోటలో 27 తేది— | 10 |
| మైపాడు రోడ్డువద్ద 28 తేది— | 3 |
| సుబేదారు పేటలో 29 తేది మధ్యాహ్నం | 3 |
| మొత్తం | 71 |

యీ యిళ్లు అన్నీ మహమ్మదీయులవేను. యివన్నీ పూరిగుడిసెలు పూరిపాకలుగా వున్నవి. యీ యిండ్లలోనుండి యింతకుముందే మహమ్మదీయులు లేచిపోయివున్నారు.

### టవునులో

| | |
|---|---|
| కామాటివీధిలో మొత్తం దహనమైన యిండ్లు మొత్తం | 20 |
| వీటిలో హెచ్చు సంఖ్య హిందువులవి. | |
| సంతపేట మార్కెటువద్ద కట్టెలకొట్టు | 1 |
| దానిప్రక్కన పూరిపాక. | 1 |
| ముత్తుకూరుగేటువద్ద పూరిపాకలు మొత్తం (మహమ్మదీయులవి.) | 10 |
| 29 తేది రాత్రి శిఖరంవారివీధిలో మసీదువద్ద హిందువుల కట్టెలకొట్టు | 1 |
| మూలపేట పాతపోలీసు లైనువద్ద | 3 |
| యివి మహమ్మదీయులవి వీటిలో కాపురంలేరు. | |
| శ్రీరంగరాజపురంలో 27 తేది కట్టెలకొట్టులోని మహమ్మదీయ పాక | 1 |

యివిగాక అక్కడక్కడా చాలాపాకలు తగులబడినవి. మహమ్మదీయులు ఖాళీ చేసిపోయి వారే తగులపెట్టుకుంటారనే వదంతిమాత్రం హెచ్చుగా వుంది.

[కొరవ ఆఖరుపేజీలో]

### —రాజీ ప్రయత్నాలు—

దశాదాగలాటాలతర్వాతను, హిందూ మహమ్మదీయ గలాటాలకుముందున్నూ, ఇరుపక్షాలకు రాజీచెయ్యాలని శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు, డా॥ రామచంద్రారెడ్డిగారలు ప్రయత్నించారు. కాని ఇరుపక్షాలవారికున్న ప్రిస్టేజిలు అంగీకారం సంపాదించాలేదు. పైన వారిప్రయత్నానికి కొందరు నవ్వారు, కొందరు దూషించారు. అపకీర్తఫలం ముట్టుకొని లాభంలేదని వారు ప్రస్తుతం విరమించుకొన్నారు.

కాని కౌరవసైన్యాన్నంతాహతమార్చి కొల్లకొలది పునిత్రస్త్రీల తాళిబొట్లు తెంచి, దిగ్విజయాన్ని పొందిన ధర్మరాజు చివర ఏమి చింతించాడో ఆలోచించండి. ప్రిస్టేజి అనేది యిరువురు ఉపసంహరించుకొంటేనేగాని యిలాటి రాజీకి ప్రయత్నించవచ్చు.

★

మిషన్ హైస్కూలు ప్రిన్సిపాల్ పీటర్ మెక్ ద్వారా మొన్న మొన్న కొంత రాజీ ప్రయత్నాలు జరిగినవట. కాని ఫలించలేదు.

★

అసలు జిల్లా అధికార్లు మారనిదే ఈ ప్రయత్నం సాగడం దుస్సాధ్యమే!

—నిష్పాక్షికుడు.

